కథానిక

# బ్రదుకు బాట

పోగుల కోటేశ్వరరావు

"చీమల పుట్టలో చిచ్చుపెట్టి పోయింది. పాపం! ఆ పరమాత్ముడి లీల అలావున్నది. ఏంచేస్తాం మనం!' ఇరుగుపొరుగు అమ్మలక్కలందరూ గడ్డంక్రింద చెయ్యి పెట్టుకుని కళ్ళ వరకూ వ్రేళ్ళు చాచి చనిపోయిన ఒకానొక వ్యక్తికొరకు సుదీర్ఘంగా సానుభూతి వాక్కును తాత్విక దృష్టితో ఉచ్చరించారు. బ్రతికివున్న రోజుల్లో ఎవరెవరు ఎంతెంత అభిమానం వలక బోశారు! అనే ప్రసక్తి ఇప్పుడు తీసుకురావడం అనవసరం. సాధారణంగా వ్యక్తి మరణానంతరంగాని ఆ వ్యక్తియొక్క మంచితనం బయట పడదు అని చెబుతారు పెద్దలు. అలాగే రామనాథం తల్లికూడాను.

తనకంటే చిన్నవాళ్ళను నలుగురిని ఈ లోకంలో విడిచి పుచ్చి రామనాథం తల్లి అతనికి పదిహేను సంవత్సరాలు నిండకమునుపే పరమపదించింది. ఇంక తండ్రి విషయం ముచ్చటించాలంటే అదొక పెద్ద గాథగా తయారవుతుంది. రామనాథానికి ఊహవచ్చి తనచుట్టూ ప్రపంచాన్ని చూడగలిగిన విజ్ఞానం కలిగిననాటి నుండీ, అతని తండ్రి ఎలా ప్రవర్తిస్తున్నదీ, అతనికి బాగా తెలుసు. అసలు రామనాథం తల్లి కడుపులో ఆకలి మంటతో నిరంతరం దహించుకుపోయినప్పటికీ ఎక్కువగా హృదయంలోని సంక్షోభ జ్వాలతో పరితపించి పోయిందని కూడా అతనికి అవగాహనమైంది. తన తల్లీ, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ కడుపునిండా కూడు తిన్న రోజులు, విశ్రాంతిగా నిద్రపోయిన దినాలు, వ్రేళ్ళమీద లెక్కించవచ్చునన్న విషయం మరువరాని సత్యంగా అతనిమనస్సులో నాటుకు పోయింది.

రామనాథం తండ్రి వాళ్ళ పూర్వీకులు సంపాదించి యిచ్చిపోయిన ఒక్కగానొక్క యకరం పొలం పెత్తనం వచ్చిన కొద్దిరోజులకే ఒకరికి పారేసి రెండు మూడు సంవత్సరాలు గడిచేలోగా ఆ వొచ్చిన ప్రతిఫలం కాస్తా తాగుడుకని తందనాలకనీ హారతి కర్పూరం లాగు కనపడకుండా హరించుచేసి పారేశాడు. అయితే అంతమాత్రాన సోమరిపోతు లాగా కూర్చుని దండగకు మేశాడని చెప్పడానికి ఎంత మాత్రమూ అవకాశం లేదు. పగలు నాలుగు జాములూ నిమిషం తీరుబోకుండా కపులకు పుచ్చుకున్న పొలంలోబడి చాకిరీ చేసుకుంటూనే వుండేవాడు. ప్రొద్దు క్రుంగిపోయిన తర్వాత గాని ఇంటికి చేరుకునేవాడు గాదు. కాస్త చెమట ఆరేవరకన్నా విశ్రాంతిగా కూర్చునే పాటి ఓపికలేక కొంపంతా మునిగిపోయినట్టు నురుగులు గక్కుతూ పరుగెత్తుకుపోయేవాడు ఊరి బయటున్న కల్లు దుకాణానికి. పీక్కుపోతూన్న నీరసించిన నరాలను ఉత్తేజ పరుచుకుని దాదాపు రెండు గంటలసేపు శరీరాన్ని మైమరచి స్వర్గ సుఖం అనుభవించేవాడు. తిరిగి నిస్సత్తువ పొడసూపిన తర్వాత రోడ్డుకు కాళ్ళు రెండూ అప్పగించేసి గుడిసెలోకివచ్చి పడేవాడు. కూడూ నీళ్ళతో పనిలేకుండా ఓ ముక్క మంచంలో పడివుండి ఇక తెల్లవారి సూరయ్య దర్శనం ఇంకా కొంతసేపటికిగాని లభించదనంగా పలుగూ పారా నెత్తి నెట్టుకుని మెలికలు దిరుగుతూన్న డొంకనబడి పోయేవాడు.

రామనాథం తల్లి బ్రతికున్నన్నాళ్ళూ బలుసాకు ఏరుకు తిన్నప్పటికీ చనిపోతూ మాత్రం తన పేరుకు సంజీవి పోసుకుని మరీ పోయిందని చెప్పొచ్చు. 'మహా దొడ్డ ఇల్లాలు' అని చెప్పి నలుగురినోట్లోనూ ఆడింది. తండ్రి ఏమీ పట్టించుకోడని తెలుసుకుని సంసార తాపత్రయంతో ఎంత శ్రమకైనా ఓర్చి, పగలనక రాత్రనక వెట్టి చాకిరీ చేసి ఆ పిల్లల్ని నలుగురినీ పోషించుకునేది. పోతే రామనాథం కూడా

చిన్నవయస్సులోనే తల్లిచేతి కర్రగొచ్చాడని చెప్పాలి. గ్రామానికి దూరంగావున్న రైలుస్టేషన్నుండి పెట్టెలు మోసుకురావడం, వూళ్లో బస్సుస్టాండు దగ్గర నిలబడి మూటలు అందుకోవడం, వగైరా వగైరా పనులు చూచుకుంటూ మొత్తంమీద రోజుకో నాలుగణాలైనా సరే సంపాదించుకుని నేరుగా మిఠాయిదుకాణానికి పోకుండా సరాసరి ఇంటికి వచ్చి తల్లిచేతి కిచ్చేవాడు. ఇలాగే కాలందొర్లి పోయింది రామనాథానికి పదిహేను సంవత్సరాల వయస్సు వచ్చేవరకూను.

తల్లి మరణానంతరం ఆ తండ్రిగారికి బిడ్డల మీద ప్రేమ మరింతగా వృద్ధిచెందింది గాబోలు! పినతండ్రిఅవుతాడనే వాదనలో ఎంతమాత్రమూ సత్యంలేదని ఋజువుచేసేందుకై రామనాథం తండ్రి ఏమని సెలవిచ్చాడయ్యా అంటే, అక్కడెక్కడో ఏజన్సీ ప్రాంతంలో ప్రాజెక్టు క్రింద కొత్తభూములు సరసంగా కవులుకు పుచ్చుకోవచ్చనీ, సాగుచేసుకున్నకొద్దీ బంగారం పండుతుందనీ, కాబట్టి పోయి మూటగట్టుకొస్తాననీ, ఇంకా ఏమిటేమిటో చెప్పేసేసి చక్కాపోయాడు.

ఇప్పుడు, ఇకముందునుంచీ జరగాల్సిన విధం ఏమిటో అర్థంగాక అయోమయంలోపడి కొట్టుకుంటున్నాడు రామనాథం. భావిజీవితం కన్ను పొడుచుకున్నా కానరాని కటికచీకటిగా గోచరించుతున్నది. అతని మనస్సు చిల్లులుపడిపోయేట్టుగా ఆలోచించినా దోవా తెన్నూ దొరకలేదు. అతని లేతహృదయం ఆట్టుడికిపోయింది. తల్లి చనిపోయినందుకు ఏడ్చినదాని కంటె మిన్నగా బ్రతికివున్న తమ్ముళ్ళనూ, చెల్లెళ్లనూ చూచుకుని రొమ్ములు పగిలిపోయేట్టు బాదుకున్నంత పనీ జరిగింది.

బడికి పోయినందువల్లనే కలిగే విద్యాగ్రంథం శూన్యమైనప్పటికీ, బుద్ధి కుదిరి నడుం వొంచి చాకిరీ చెయ్యడానికీ, కష్టమనుకోకుండా యే రకమైన జీవితమైనా వెళ్ళబుచ్చటానికి కావాల్సిన విజ్ఞానం అవసరమైనంతగా వున్నది. అయితే దాన్ని రామనాథం ఉపయోగించేందుకు సిద్ధపడ్డప్పటికీ స్వీకరించేందుకు సంఘం ముందుకు రావాలిగా మరి! తను యేవృత్తి చేయడానికైనా సరే తయారుగా వున్నాడు. కాని చూపించేది యెవరు? అనే ప్రశ్నకు మాత్రం ఇప్పట్లో సమాధానం లభించేట్టుగా కనుపించటం లేదు.

* * *

ఈప్రపంచంలో కొంతమంది భాగ్యవంతులు, ఎడతెరిపిలేకుండా కృషిచేసి కూడబెట్టిన ప్రముఖులు, దేవార్సిగా తిరిగే బీదవారిపట్ల, ఛీదరింపు కలిగించే అలగాజనంపట్ల అపరిమితమైన దయాదాక్షిణ్యాలు ప్రదర్శింప జేస్తున్నారు. గనుకనే బీదవాళ్ళు ఇంతహాయిగా బ్రతకగలుగుతున్నారు. వాళ్లే లేకపోతే అన్యాయంగా చచ్చిపోయేవాళ్ళు అని మరికొంతమంది ప్రబుద్ధుల నిశ్చితమైన అభిప్రాయం. ఈ వాదన వెనకాలుండే సత్యాసత్యాలు, ఆ వాదించేవారి స్వార్థపరార్థాలు, విని అంగీకరించేవారి చిత్తశుద్ధి మున్నగు విషయాలు ఇప్పుడు చర్చించవలెందుకుగాని, ఆ వూళ్లోవుండే ఓ ఘరానా వ్యాపారస్తుడు తనకు ఒక మార్గం చూపినందుకు రామనాథం ఆయన్ను ఎంతగానో కొనియాడినమాటవాస్తవం. దిక్కులేనివారికి దేవుడు పంపించిన దూతగా ఆయన్ను పూజించాడు రామనాథం.

శ్రీమాన్ రంగయ్యచెట్టిగారు గౌరవనీయులైన ప్రముఖ మంత్రిగారిచే అనేకానేక నాయకమ్మన్యుల సమక్షంలో శంకుస్థాపన చేయించి కట్టడం లేవనెత్తిన 'దైవచింతా రైస్‌మిల్లు'లో ఒక కార్మికపదవి పొందగలిగాడు రామనాథం. మిషను అరిగిపోకుండా నూనెరాచి తుడవటం రామనాథం చెయ్యవలసిన ఉద్యోగం.

నెల తిరిగే సరికి యిరవయిరాళ్ళు ఘల్లుమని మోగుతాయి మిల్లు కౌంటరు రాతిమీద- రామనాథం జీతం. తన పదిహేనేళ్ళ జీవితంలో యేనాడు చూచాడు ఇన్ని రూపాయలు? మొదటి నెల భత్యం పుచ్చుకుంటూవుంటే అతని కళ్ళు జిగేలు మన్నాయి.

సూర్యోదయం నుంచీ అస్తమయం వరకూ మిల్లులో పనిచేసేవాడు రామనాథం. పోతే తమ్ముళ్లూ, చెల్లెళ్లూ నలుగురూ తలోక బజారుకు పోయి అడుక్కొచ్చుకునేవాళ్లు. ఎంత చిన్నతనమైనా ఏదో యింత 'పిండాకూడు' వెతుక్కొని పొట్టనింపుకునే విద్య నేర్చుకున్నారు. ఆ రెండు

ముద్దలు కూడా దొరకని పూట రామనాథం తెచ్చిన జీతం ఉపయోగ పడుతూండేది.

ఇదే రకంగా కాలచక్రం గిరగిరా తిరిగి పోతూంది. మరేం ఫర్వాలేదు అన్న మనస్థయిర్యం రామనాథానికి కలిగిన కొద్దిరోజుల్లోనే ఆచక్రం ఇరుసులో వడ్డి పేరుకుని దాని గమనం మందగించేట్టుగా సూచనలు కనిపించినవి. మిల్లులో కొండంత చక్రం దగ్గరనుంచీ చీమంత నట్టు వరకూ తుడిచి బాగుచెయ్యడానికి అలవాటుపడ్డ రామనాథం ఈ చక్రాన్ని కూడా రిపెయిరు చేసి తిరిగి యథా ప్రకారంగా సాగించాలనే ఉద్దేశ్యంతో చాలాచాలా ప్రయత్నించి చూచాడు.

ఇంతకూ వచ్చిన చిక్కేమిటంటే వూరిచుట్టూ వేలకొలది యకరాలు మాగాణి భూమి వున్న ఆ గ్రామంలో ధాన్యం కొరత యేర్పడి ఒక్కొక్కరోజు గడచిన కొద్దీ తీవ్రరూపం దాల్చింది. దాని పర్యవసానంగా దైవచింతా రైసుమిల్లు ఇకముందు నిత్యమూ పనిచేయడానికి అవకాశం లేకపోయింది. ఒకవేళ ఏదైనా వున్నప్పటికీ అది చాటుగా మాటుగా అర్ధరాత్రివేళ జరగాల్సినదని. అందుచేత మిల్లు మేనేజిమెంటు వారు తమను అత్యంతప్రియులని చెప్పుకునే కార్మికులకు ఒక విజ్ఞాపన చేయించారు. పని కాలం తగ్గించబడుతుందనీ, మిల్లు యజమానులు కష్టనష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది గనుక తక్కువ కూలిరేటును అంగీకరించటం కార్మికుల కనీసపు విధి అనీ, దేశక్షేమంకోసం వారందరూ సమిష్టిగా పాటుబడాలనీన్నీ ప్రచారంచేసి కూలీలందరినీ ఒప్పించ గలిగేందుకు ఆగ్రామంలోని దేశసేవా ధురంధరులు మిక్కిలిగా తోడ్పడ్డారు. కొంతమందికని వాళ్ళకు 'ఆనరరీ ఫించను' ఇవ్వటం కూడా జరిగింది. దేశంలో విపరీత విపత్కర పరిస్థితులు యేర్పడ్డవి గనుక, సంఘశ్రేయస్సుకు దృష్టిలోనుంచుకుని కూలీలు ఇంతమాత్రం త్యాగంచేసి తీరాలని జెయిలుకుపోయిన పుణ్యం సంపాదించుకున్న జాతీయవాదులు ప్రచారం చేశారు. ఆ రకంగా కార్మికుల్లో అలజడిని అసంతృప్తిని చల్లార్చి శాంతి భద్రతలను కాపాడారు. అయితే రామనాథాన్ని మాత్రం పనిలోనుండి తొలగించలేదు. తగ్గించబడిన జీతంతో జీవిత సారాన్ని ఇంకా రుచిమూడ గలిగే అవకాశం జారిపోలేదన్న మాట.

వెనుకటి రోజుల్లో రామనాథం రూపాయి బిళ్ళ చేతబుచ్చుకుని బజారుకు పోతే రెండుశేర్ల బియ్యం మోసుకొచ్చుకునేవాడు. ఇప్పుడు జీతం పదిహేను రూపాయలకు తగ్గించబడిన తరువాత అర్ధశేరుమీద గిద్దెడు గింజెలు గిట్టుబాటు అవుతున్నవి. ఇంతకు మునుపు తన తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ బొచ్చె చేత బుచ్చుకుని బజారుకు పోతే నలుగురికీ ఒకపూటకు సరిపొయ్యే గ్రాసం దొరికేదల్లా ఇప్పుడు ఎక్కే గడప దిగే గడపే గాని ఒకళ్ళకూ చాలినంత లభించడం లేదు.

ఇట్టి పరిస్థితుల్లో దయార్ద్ర హృదయుడైన శ్రీమాన్ రంగయ్యచెట్టిగారి చెంతకు వెళ్ళి కష్టసుఖాలు చెప్పుకుంటే కొంతైనా ప్రయోజనం వుండకపోదని తలపోశాడు. ఆయనగారి నివాసమందిరానికి వెళ్ళి మాట్లాడటం మంచిదనే అభిమతంతో రామనాథం బయల్దేరి వెళ్ళాడు.

శ్రీ మహాలక్ష్మీదేవికి టెంకాయ నీరాజనం సమర్పించుకుని, పూజచేసిన పుష్ప తీసుకుని చెవులో కుక్కుకుంటూ అప్పుడే బయట వరండాలోకి వొచ్చాడు శ్రీ చెట్టి. సమయానికే వచ్చాను గదా, ఇంకా కొంచెం ఆలస్యంచేస్తే ఆయనగారు ఎక్కడికి పనిమీద వెళ్ళిపోయేవాడో, అని సంతోషించాడు రామనాథం. గుటకలు మింగుతూ, చేతులు నలుపుకుంటూ రామనాథం చెప్పదలుచుకున్న విషయం అర్థోక్తిలో వుండగానే శ్రీమాన్ రంగయ్యచెట్టిగారు అందుకున్నాడు.

'మేం చేసేదేం లేదబ్బాయి! నువ్వంటే నువ్వే గాదు. అందరికీ వున్నదేగదా ఈ ఇబ్బంది! లాభాలు గూథంలోకి దిగుతున్న మేం యెవరను కోవాలి చెప్పు. కూలీలు కష్టపడతారనే వుద్దేశంతోనే మేము ఎంతశ్రమకైనా ఓర్చి మిల్లు నడిపిస్తున్నాం. ఏదో ఆ పరమేశ్వరుడి దయకొద్దీ ఇచ్చినంతా తీసుకొచ్చి ఎదురు పెడుతున్నామే గాని మేమేం మూట గట్టుకుపోవడం లేదు.'

ఇంకా ఏమేమిటో ఏకరువుబెట్టి అడిగేద్దామనుకున్నాడుగాని కుర్రకుంక యేడ్చిపోతాడని దయదల్చి అంతటితో సాగనంపేశాడు శ్రీ చెట్టి.

ఆశగాచూస్తూ వచ్చిన రామనాథం నిరాశతో మరలి వెళ్ళాడు.

మిల్లులో పనిచేస్తూవుంటే పాటి కూలీలు అనేకసార్లు రామనాథాన్ని చాలాగా పొగుడుతూండేవారు. చిన్నతనంలోనే వీడు మిల్లులోని అన్నిభాగాలను గురించీ క్షుణ్ణంగా తెలుసుకుని చదువూ సంధ్యా లేకపోయినా అతి సున్నితంగా తీర్చిదిద్దే నేర్పరితనాన్ని సంపాదించ గలిగినందుకు తోటికూలీలు ఎంతగానో మురిసి పోయేవారు. అప్పుడప్పుడు రామనాథం యెదట అంటూ వుండేవారుగూడా. 'నీ కేదిరా. నువ్వు ఇంజనీరువు. యూడికెళ్ళినా నీ క్కావాల్సినంత జీతం ఇస్తారా' అని. ఈ మాటలవల్ల ఇంత కాలంగా రామనాథంలో ఎలాంటి చైతన్యమూ కలుగకపోయినప్పటికీ, గడచిపోయిం తర్వాత ఇప్పుడు అవే మాటలు అతని చెవుల్లో గింగిరాలు తిరుగుతూ మార్పుకోసం ముందడుగు వేయమని బలవంతం చేస్తున్నాయి.

'ఈ రకంగా అర్ధాకలితో పడివుండేబదులు ఇంకోరకంగా మరెక్కడైనా నా అదృష్టాన్ని ఎందుకు చవిచూడ గూడదు' అనే అభిప్రాయం కలిగింది రామనాథానికి.

ప్రక్కనున్న పట్టణానికి వెళితే అక్కడ పెద్దపెద్ద ఫ్యాక్టరీలు అనేకం వుంటాయి గదా, తనకు ఇంతకంటె అన్నివిధాలా మంచి జీవనోపాధి దొరుకుతుంది, అనే నిర్ణయానికివచ్చాడు రామనాథం.

పసికూనలు తమ్ముళ్ళనూ, చెల్లెళ్ళనూ వదిలి వెళ్ళడమంటే మనస్సు పీక్కుపోయింది అతనికి. పోనీ వెంట తీసుకుపోదామనుకుంటే అందుకు అసలే ఆస్కారంలేదు. పగిలిపోయిన గుండెతో కదకు వెళ్ళడమే నిశ్చయించుకున్నాడు రామనాథం. ఇల్లు జాగ్రత్త అని చెప్పి ఉన్నంతలోనే పెద్దవాడికి హెచ్చరికచేసి బయల్దేరాడు. వెళ్ళేటప్పుడు కడసారి చెల్లెలు కళ్లనీళ్లు నింపుకుని రెండు కాళ్ళూ పట్టుకుంటే అతని గుండెలు తరిగిపోయినవి. ఏమైనా తప్పేదిలేదని బలవంతాన తెములుచ్కొని పొంగివస్తూన్న దుఃఖాన్ని ఆపు చేసుకోలేక అవస్థపడుతూ వెళ్ళిపోయాడు రామనాథం. ఇక ఆ పిల్లలు పూర్తిగా గ్రామం యొక్క అదరాభిమానాలమీద ఆధారపడి వుండాలని అతనికి తెలియకపోలేదు.

ఏమూల చూచినప్పటికీ ఆకాశాన్ని చీల్చుకు పోతూన్న గోపురాలు, మనిషి మెడ వెనక్కు ఎంత విరగదీసుకున్నా అంతుకనపడని ఆకాశ సౌధాలు, పాలరాతి స్తంభాలతో పెద్దపెద్ద ప్రాకారాలు, విశాలమైన రోడ్లు, ఎడతెరిపి లేకుండా తిరుగుతూన్న కార్లూ, ట్రాములూ, రైళ్ళూ, గంభీరమైన వాతావరణంలోకి వచ్చి పడ్డాడు రామనాథం.

'అహా! ఈ పట్టణం ఎంత సిరిసంపదలతో తులతూగుతున్నది? ... మన వూళ్ళో డబ్బు లేదు అసలు. ఈ పట్టణంలో యెవరికెట్టినా కావాల్సినంత ధనం. ఎక్కడ చూచినా కుప్పలు కుప్పలుగా మూలుగుతుంది. ఇక్కడంతా సుఖంగా బ్రతుకుతారు స్వర్గం అంటే ఎక్కడో లేదు. ఇక్కడే వూసిపడ్డది' అనుకుని ఉవ్విళ్ళూరి పోయాడు రామనాథం.

అక్కడ జీవితం నిర్విరామంగా తోచుతున్న ఆ మహాపట్టణంలో, ఒక్కొక్క నిముషం కొన్ని లక్షల ఖరీదు చేస్తుందా అనిపించే ఆ నగరంలో రామనాథం ఓ పెద్ద ఫ్యాక్టరీలో, బాగా పేరు మోసిన కర్మాగారంలో, 'ఇంజనీరు' కాక పోయినా తత్సంబంధమైన ఓచిన్న కార్మికుడుగా పనిలో ప్రవేశించాడు.

'బుయ్యి' మని ఫ్యాక్టరీ గొట్టాం నిముషాల కొలదీ గుక్కపట్టి కూస్తూవుంటే రామనాథం విచిత్రానుభూతి పొందాడు. కొన్ని వందల నుంది కార్మికులు బారులుతీర్చి, రకరకాల మరలతో వాళ్ళవాళ్ళ మనస్సులను మేళవింపుచేసి ఒక్కొక్కక్షణం ప్రాణమొక యెత్తుగా పని చేస్తూవుంటే, 'ప్రపంచం ఎంత విశాలమైనది' అని తొలిసారిగా రామనాథంమనస్సుకు తట్టింది. దావానలంగా మండుతున్న ఫ్యాక్టరీ బొయ్యి దేదీప్యమానమైన వెలుగులో కూలీలు నిలబడి, వారితోబాటు తనూ చేరివుంటే రామనాథం అవ్యక్త ఆవేదన అనుభవించాడు.

ఈ కొత్త జీవితపథంలో కాలుబెట్టిన తదాది రామనాథానికి హృదయ స్పందన ఇతోధికమైంది. మనోవ్యథ మరింతగా వృద్ధిపొందింది. వేలకొలది ఆ కూలి జనంలో ఒక్కరిముఖాన

కూడా జీవకళ మచ్చుకైనా దొరకనందుకు రామనాథం ముఖ కవళికలు కూడా క్రమంగా వారితో విలీనమై పోయినవి.

ఫ్యాక్టరీలో పని శరవేగంతో జరిగి పోతూన్నది. రామనాథానికి మాత్రం 'రోజులు' అంతకంతకు బహు నెమ్మదిగా నడుస్తున్నాయి.

అదేమిటిది చూడమని ఇప్పుడు 'రోజు' అడుగు తీసి అడుగు పెట్టనని భీష్మించుకూర్చున్నది. బజారులో పేపరు అమ్ముతూండే కుర్రవాడు తను పనిచేస్తున్న ఫ్యాక్టరీ పేరుచెప్పి ఏమేమిటో పెద్దపెద్దగా కేకలు వేస్తుంటే అర్థంగాక ఫ్యాక్టరీ దగ్గరకు వెళ్ళి చూచాడు. అసలు ఆ క్రిందటి రోజు సాయంకాలము పనిముగించుకుని వచ్చేప్పుడు తనలాంటి వారి క్షేమంకోసం సదా కృషిచేయడానికై నియమించ బడిన ఉద్యోగి నలుగురినీ సమావేశపరచి ఏదో ఉపన్యాసం దంచి పారేశాడటగాని రామనాథానికి ఎంతమాత్రమూ బోధపడలేదు. కనుక సరాసరి ఫ్యాక్టరీ దగ్గరకు వెళ్ళి చూచాడు.

నిన్నటిరోజున ప్రొద్దుపోయేవరకూ ప్రకృతితో పోటీపడి మేఘాలుగా పొగ విరజిమ్మిన ఆ ఫ్యాక్టరీ గొట్టం ఇవాళ నిశ్శబ్దంగా వుండిపోయింది. క్రిక్కిరిసిపోయి జనం తిరుగుతూండాల్సిన ఫ్యాక్టరీ ఆవరణలో ఒక్క పురుగు కూడా కనుపించలేదు. 'మిల్ క్లోస్డ్' అని ఇంగ్లీషులో బోర్డు తగిలించివుంటే చదువుకోటం చాతగాక గేటుదగ్గర నిలబడి రామనాథం ఇంకా ఏమిటో ఆశకొద్దీ మునగాళ్ళమీద నిలబడి నోరెత్తి లోపలకు చూస్తున్నాడు.

'ఒరేయ్! ఎవడ్రా నువ్వు! ఇంకా ఇక్కడ నిలబడి చూస్తున్నావేం, పాడుపీనుగా! కదలవేం!' అని గద్దించాడు కాపలావాడు లాఠీ ఝుళిపించుతూ.

బరువెక్కిన గుండెలతో, బాధపడిన మనస్సుతో, శుష్కించిపోయిన శరీరంతో రామనాథం తన పల్లెకు పయనమయ్యాడు. మసక మసకగా చీకటిపడుతూండగా గ్రామాన్ని అంత దూరంలో నిలబడిచూచి, తన తమ్ముళ్ళనూ, చెల్లెళ్ళనూ గురించిన తలంపులతో చరచరా సాగివచ్చాడు రామనాథం. పూర్తిగా చీకటి కమ్ముకుంటూన్న గ్రామంలోకి ప్రవేశించగానే రామనాథాన్ని అక్కడక్కడ మినుకు మినుకుమంటున్న దీపాలు ఆహ్వానించినవి. గుడిసె ముందుకు చేరుకున్నాడు కాపురంచేసే కొంపకుండాల్సిన లక్షణం ఒక్కటీ కూడా ఆ వాకిలి ముందు కనుపించటం లేదు. రామనాథం గుండెలు మరింతగా బిగుతెక్కి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బరువెక్కిపోయినవి. తాళం లేని తలుపును నెమ్మదిగా నెట్టాడు. కీచు కీచుమని అరుస్తూ ఆ తలుపు ఇంటిలోని ప్రశాంతతకు భంగం కలిగించింది. నిప్పుపుల్ల గీచి బుడ్డికోసం వెదికాడు. వెంటనే దొరికింది గాని ఆ దీపపు బుడ్డిలో చమురు ఏనాడో హరించుకుపోయింది. ముట్టించిన వెంటనే వొత్తి కాలిపోయి ఆరిపోయింది. నిప్పుపుల్ల వెలుగులో ఇల్లు నాలుగుమూలలూ కలియ జూచాడు.

ఒకమూల బూజు - దుమ్ము కొట్టుకుని నాలుగు మట్టిబొచ్చెలు పడివున్నాయి. వాటిల్లో ఒకటి రెండు మెతుకులు ఎండిపోయి చెక్కగట్టి అతుక్కుని వున్నాయి. అంతే.

జీవితం చదరంగపు ఆటవంటిదని నా కనిపిస్తున్నది. ఆటలోని ప్రాథమిక సూత్రాలను ప్రశ్నించేందుకు వీలులేదు. ప్రయోజనం లేదు కూడా. చదరంగంలో గుర్రం నడక అంత చిత్రంగా ఎందుకుండాలి? ఏనుగు నిలువుగా, శకటు అయిమూలగా మాత్రమే ఎందుకు నడవాలి? అంటే అవి అంతేనని సమాధానం వస్తుంది. ఆ సూత్రాలకు లోబడితేనే ఆట సాగుతుంది. వాటి గురించి ఫిర్యాదు చెయ్యడం అవివేకం.

—సోమర్‌సెట్ మాఘమ్.